క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఎస్‌ఐ

జూలూరుపాడు: జూలూరుపాడు ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన బానోత్ రాణాప్రతాప్ సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను కొత్తగూడెంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

టూటౌన్ ఎస్‌ఐగా షాహినా

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం టూటౌన్ ఎస్‌ఐగా సయ్యద్ షాహినా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆమె టూటౌన్ ఎస్‌ఐగా చేరారు. గతంలో కొత్తగూడెం వన్‌టౌన్, అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

జూలూరుపాడు: గుండెపుడి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతూ సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డ్రెయినేజీల్లో పూడిక తీయడం, పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగించడంతోపాటు, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కోరారు. కార్యక్రమంలో వల్లమల చందర్‌రావు, బానోత్ మధు, వల్లమల దానయ్య, బోడా లక్ష్మా, జమ్మి యశ్వంత్, ఆనగంటి ధనమయ్య తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు నాటితే కోతులు రావు..

పాల్వంచరూరల్: అడవుల్లో పండ్ల తోటలను పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని, ఫలితంగా జనావాసాల్లోకి కోతులు రావని తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యను సోమవారం హైదరాబాద్‌లో కలిసి కోరినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు గద్దల రమేశ్ తెలిపారు. మామిడి, జామ, బొప్పాయి, అరటి వంటి పండ్ల చెట్లను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

పాల్వంచ: పట్టణంలోని నెహ్రూనగర్ కేఎల్ఆర్ డిగ్రీ కళాశాల వెనుక ప్రాంతంలో మున్సిపల్ అధికారులు మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు బి.జ్యోతి, పి.ప్రమీల కోరారు. వారు సోమవారం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

పట్టణంలో సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

ఇల్లెందు: పట్టణంలో పేరుకుపోయిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. శానిటేషన్, మంచినీరు క్లోరినేషన్, వీధిలైట్లు ఏర్పాటు, క్లీన్ అండ్ గ్రీన్ పాటింపు లాంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్లు సీహెచ్ సుజాత, సిలివేరు అనిత, సామల మాధవి, తోట లలిత, శారద, స్వాతి, బిందు, చెరుపల్లి శ్రీనివాస్, వాంకుడోతు తార, యలమందల వీణ, సిలివేరు సత్యనారాయణ, రవితేజ, కిరణ్, వాసు పాల్గొన్నారు.

జ్వరాల తీవ్రతను అదుపు చేయాలి



మాట్లాడుతున్న చింత నర్సింహారావు

ఇల్లెందురూరల్: పల్లెల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, వైద్యాధికారులు తక్షణం స్పందించి జ్వరాల తీవ్రతను అదుపులోకి వచ్చేలా వైద్య సేవలు అందించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింత నర్సింహారావు, మోతీలాల్ కోరారు. న్యూడెమోక్రసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో దోమల బెడద అధికం కావడంతో ప్రజలు టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా లాంటి జ్వరాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి పల్లెల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. సమావేశంలో నాయకులు రామచంద్రయ్య, ఎట్టి రమణయ్య, బానోత్ మాలు తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ పడటం లేదు..

- ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఇక్కట్లు
- సిగ్నళ్లు లేక ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలు
- జిల్లా కేంద్రంలో నానాటికీ పెరుగుతున్న సమస్య



పోస్టాఫీస్ సెంటర్‌లో వాహనాల రద్దీ
(ఇన్‌సెట్) పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇందుకు తగినట్లు ట్రాఫిక్ పోలీసులు నిబంధనలు అమలు చేయాల్సిన అవసరముంది. లేనిపక్షంలో ప్రమాదాలు పెరిగే అవకాశమున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రెండేళ్ల కిందట కొత్తగూడెంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేశారు. అయితే, కొద్ది నెలలకే సాంకేతిక లోపాలతో సిగ్నళ్లు పని చేయడంలేదు. ఆ తర్వాత మళ్లీ కొన్ని నెలలకు పునరుద్ధరించినా ప్రస్తుతం మళ్లీ పని చేయకపోవడంతో ప్రధాన కూడళ్ల మీదుగా వాహనాల రాకపోకలపై నియంత్రణ ఉండటం లేదు.

ట్రాఫిక్ పోలీసులు ఉన్నా..

ప్రస్తుతం కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారు ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల ఫొటోలు తీయడం వంటి వాటి పైనే ఎక్కువ దృష్టి సారిస్తున్నారని తెలుస్తోంది. దీంతో వాహనదారులు వారి ఇష్టానుసారం వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీగా వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్ అయితే తప్ప ట్రాఫిక్ పోలీసులు స్పందించని పరిస్థితి కొత్తగూడెంలో ఉంది. ప్రమాదాలు జరుగకుండా ఉండాలంటే సిగ్నళ్లను మళ్లీ పునరుద్ధరించాలి. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఉంటే వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోనికి తీసుకరావాల్సి ఉంది. ఈ విషయంపై జిల్లా పోలీసు అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకుంటే, వాహనదారులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

ప్రధాన కూడళ్లలో ఇష్టారాజ్యం

జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు పని చేయకపోవడం వల్ల వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ముందుకు వెళ్తున్నారు. ప్రధానంగా కొత్తగూడెం సూపర్‌బజార్ సెంటర్, బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు పని చేయడం లేదు. సూపర్‌బజార్ సెంటర్ నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం. ఆ ప్రాంతంలో రైల్వే స్టేషన్, వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉన్నాయి. రైళ్లు వచ్చినప్పుడు స్టేషన్ నుంచి బయటకు వచ్చే ప్రయాణికులు, వ్యాపార సముదాయాలకు వచ్చే వినియోగదారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రాంతంలో సిగ్నళ్లు తప్పని సరి పనిచేసేలా చూడాల్సి ఉంది. ఇక బస్టాండ్ సెంటర్‌లో బస్టాండ్‌కు తోడు అమరవీరుల స్తూపం, చిల్డ్రన్ పార్కు, వివిధ కళాశాలలు, పాఠశాలలు, దేవాలయాలు సైతం ఉండడంతో వాహనాల రద్దీ సర్వసాధారణమైపోయింది. అక్కడ కూడా సిగ్నళ్లు పని చేయక వాహనదారులు ఇష్టానుసారంగా వచ్చివెళ్తుండటంతో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. పోస్టాఫీస్ సెంటర్‌లో కూడా నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆ సెంటర్ నుంచి ఖమ్మం, విజయవాడ, భద్రాచలం, అనిశెట్టిపల్లి రోడ్డుకు వెళ్లే మార్గాలు ఉన్నాయి. దీంతో పాటుగా ఆ సెంటర్ నుంచే జిల్లా కోర్టు, రవాణాశాఖ, రిజిస్ట్రార్ కార్యాలయం, జూనియర్ కళాశాల, డీఎస్పీ కార్యాలయం, వివిధ పాఠశాలలకు వెళ్లే మార్గాలున్నాయి. వీటన్నింటికీ వెళ్లేదుకు వాహనాలు నిత్యం తిరగడం వలన రద్దీ నెలకొంటూ ఉంటుంది. పోస్టాఫీస్ సెంటర్‌లోనూ సిగ్నళ్లు పని చేయకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని అధికారులు పరిశీలించి కొత్తగూడెంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్ల వ్యవస్థను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. కాగా, ట్రాఫిక్ సిగ్నళ్ల పునరుద్ధరణ అంశంపై ట్రాఫిక్ ఎస్‌ఐ వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

త్రివేణి పాఠశాలలో మోడల్ ఎన్నికలు



ఓటు వేస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంరూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత విద్యార్థులకు తెలిపేందుకు మోడల్ ఎన్నికలు నిర్వహించామని త్రివేణి పాఠశాల పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి తెలిపారు. లక్ష్మీదేవిపల్లిలోని త్రివేణి పాఠశాలలో సోమవారం విద్యార్థులకు హౌజ్ ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ గొల్లపూడి జగదీశ్‌తోపాటు కాట్రగడ్డ మురళీకృష్ణ, వై.వి.సురేశ్, శ్రీనివాస్‌సింగ్, సౌజన్య, ఫాతిమా పాల్గొన్నారు.

హెల్త్ కార్డుల అందజేత



హెల్త్‌కార్డులు అందజేస్తున్న జడ్జి కీర్తిచంద్రికరెడ్డి

ఇల్లెందు: తెలంగాణ ప్రభుత్వం న్యాయవాదులకు హెల్త్ కార్డులు అందజేయగా సోమవారం కోర్టు హాల్లో న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రికరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రవికుమార్, ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, నవీన్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు చెన్నకేశవరావు, ఎన్.మల్లికార్జున్‌రావు, వెంకటనర్సయ్య, దంతాల ఆనంద్, బాలకృష్ణ, మహేశ్వరరావు, రబ్బానీ, వినోద్ పాల్గొన్నారు.

సందడిగా వనమహోత్సవం

పాల్వంచ: పట్టణంలోని ఆడమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో లైటింగ్ డెకరేషన్, సౌండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కత్తి శ్రీనివాసరావు, ఎండీ అన్వర్, పెద్బెట్టి శ్రీనివాసరావు, కొట్టే రమేశ్, కస్నానాయక్, అంబటి వెంకట్, నంది వీరభద్రం, రవి, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, రమణమూర్తి నాయుడు, వై.వెంకటేశ్వర్లు, కందుకూరి రాము, పైడిపల్లి మహేశ్, పులి సత్యనారాయణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు నిబంధన తొలగించండి..



మాట్లాడుతున్న సత్యనారాయణ

పాల్వంచరూరల్: రైతు రుణమాఫీలో రేషన్ కార్డు నిబంధన తొలగించాలని, పట్టాదార్ పాస్‌పుస్తకం స్థానంలో పహాణీలపై రుణాలు తీసుకొనే అవకాశం కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో కొండబోయిన వెంకటేశ్వర్లు, అచ్చయ్య, పాకాల వెంకట్రావు, నాగిరెడ్డి, నాగభూషణం, నరేందర్, కొర్రాజులు, భద్రయ్య పాల్గొన్నారు.

సంత టెండర్లలో అవినీతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలోని వారాంతపు టెండర్లలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి, టెండర్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో కామేశ్, ప్రవీణ్, కుమార్, రంజిత్, సరోజ, కళ్యాణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల అధ్వర్యంలో..

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్‌లను చెల్లించాలని, ఏఆర్‌ను 20 శాతానికి పెంచాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బంధు వెంకటేశ్వరరావు, చల్లగుళ్ల నాగేశ్వరరావు, ఎంవీఎస్ నారాయణ, జోగయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

'భద్రతా ధోరణి' ఎంతో కీలకం..



మాట్లాడుతున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: సురక్షిత, ఆరోగ్యకర పని వాతావరణం సృష్టించడంలో భద్రత ధోరణి కార్యక్రమం ఎంతో కీలకమని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. సోమవారం ఇల్లెందు ఎంవీటీసీ కార్యాలయంలో గనులు, విభాగాలు, పిట్ సేఫ్టీ విభాగాల కమిటీ సభ్యుల భద్రత ధోరణి కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రమాదాలను గుర్తించి, ప్రతిస్పందించేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను ఉద్యోగులకు అందించటం వల్ల ప్రమాదాలు తగ్గించవచ్చని తెలిపారు. సమావేశంలో శివప్రసాద్, మహేశ్, నజీర్ అహ్మద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్క్‌షాపులో జీఎం జన్మదిన వేడుకలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధి సెంట్రల్ వర్క్‌షాపులో వర్క్‌షాపు జీఎం దామోదర్ జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, కార్మికులు ఆయనకు శుభాకాంక్షలు తెలపగా, వర్క్‌షాపు ఉద్యోగి నూర్పి రాజశేఖర్ మొక్క అందజేశారు. ఇంజనీర్లు, ఉద్యోగులు భాస్కర్‌రెడ్డి, నారాయణ, వెంకటరాజు, యాదగిరి, సూపర్‌వైజర్లు తాటిపాముల రమణ, దారా రమేశ్, ప్రసాద్, రామశంకర్, శ్రీనివాస్‌రెడ్డి, మొక్కల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి సాయం చేయండి..

కొత్తగూడెంఅర్బన్: ఆపదలో ఉన్న వారికి సాయం అందించాలని, వారికి చేసే సేవలో ఎంతో సంతృప్తి ఉంటుందని 35వ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి అన్నారు. సోమవారం వార్డులో తన పుట్టినరోజు వేడుకలు జరిగాయి. అనంతరం వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న దేవరపల్లి భాస్కర్‌ను కలిసి పరామర్శించారు. నెల రోజులకు సరిపడే నిత్యావసర వస్తువులు, రూ.3,000 నగదు భాస్కర్‌కు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తంగెళ్ల లక్ష్మణ్, రజనీకాంత్ బండారి, రాజు, జానీ, తిరుపతి, ఓం ప్రకాష్ పండిట్, పవన్, కుమార్, మోహన్, పూర్ణ, ఆడప నవీన్, నరసింహ పాల్గొన్నారు.

19న హైదరాబాద్‌లో సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 19న హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో 48వ ట్రైపార్టీయేట్ సేఫ్టీ సమావేశం నిర్వహిస్తున్నారని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య సోమవారం తెలిపారు. డీజీఎంఎస్, సింగరేణి యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు.

గ్యాస్ లీకేజ్‌పై అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచ: వంట గ్యాస్ వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం హెచ్‌పీసీఎల్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని బొల్లేరుగూడెంలో ప్రభుత్వ గిరిజన బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లకు ఉన్న రెగ్యులేటర్లు, పైపు, స్టవ్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని చెప్పారు.

యూరియా కొరత రావొద్దు

ఇల్లెందు: మండలంలో యూరియా కొరత రాకుండా చూడాలని మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అసోసియేషన్ బాధ్యులు కోరారు. సోమవారం ఖమ్మం అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

'అమ్మమాట–అంగన్‌వాడీ బడిబాట'



కొత్తగూడెంటౌన్: మొక్క నాటుతున్న అంగన్‌వాడీలు



జూలూరుపాడు: మాచినేనిపేటతండాలో..

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడున్నరేళ్ల చిన్నారులను చేర్చుకునేందుకు సోమవారం అమ్మమాట – అంగన్‌వాడీ బడిబాటను కొత్తగూడెంలో ప్రారంభించారు. రామవరం, కొత్తగూడెం, పాతకొత్తగూడెం, రుద్రంపూర్, గణేశ్‌టెంపుల్, రైటర్‌బస్తీతో పాటు పలు ప్రాంతాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో ర్యాలీలు నిర్వహించారు. పాత కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెంఅర్బన్ సీడీపీఓ సలోమి హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు, యువత, ఎన్జీఓలతో కలిసి ర్యాలీ నిర్వహించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమాదేవి, టీచర్లు గోనేమణి, సరోజిని, లావణ్య, రజిత పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ సోమవారం మాచినేనిపేటతండాలో అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, తల్లిదండ్రులు కలిసి ర్యాలీ నిర్వహించారు. అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో నాగజ్యోతి, షాహీదా, లలిత, స్రవంతి, శారద, సునీత, సుజాత, సరోజ పాల్గొన్నారు.

10వ వార్డులో..

సూపర్‌బజార్(కొత్తగూడెం)/టేకులపల్లి: అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో కౌన్సిలర్ మునిగడప పద్మ, 8వ వార్డులో కౌన్సిలర్ కంచర్ల జమలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. టేకులపల్లిలోనూ ర్యాలీ నిర్వహించారు.

జీఓ 10 రద్దు చేయాలని ధర్నా



ఇల్లెందు: ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు



సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఇల్లెందు: ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్–10ని వెంటనే రద్దు చేయాలని, బలవంతపు ఉద్యోగ విరమణ ఆపాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (సీఐటీయూ) బాధ్యులు డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ మాట్లాడుతూ.. జీఓ–10 వల్ల అంగన్‌వాడీలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించే పద్ధతికి స్వస్తి పలకాలని కోరారు. కార్యక్రమంలో టి.కృష్ణ, ఆలేటి కిరణ్, కాళంగి హరికృష్ణ, బయ్యా అభిమన్యు, రాంబాయి, ఫాతిమా, సారమ్మ, ధనమ్మ, జయశ్రీ, సంధ్య, సోమలక్ష్మి, అరుణ, కుమారి, అలివేలు, మంగ, దీప్తి తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ బందోబస్తు పర్యవేక్షించారు.

కొత్తగూడెంలో..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో పీఏకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.బ్రహ్మచారి, డి.వీరన్న, కె.సత్య, దొడ్డ రవికుమార్, భూక్యా రమేశ్, కళావతి, పద్మ, శైలజ, రత్నకుమారి, జుబేదా, పద్మ, నాగమణి, సుజాత, రమ, నాగమణి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో ప్లాంట్ నెలకొల్పండి..



ఎంపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: విద్యుదుత్పత్తికి అన్ని రకాల వనరులు ఉన్న పాల్వంచలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పాలని డీసీఎంఎస్ చైర్మన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. ఆదివారం సాయంత్రం పాల్వంచకు వచ్చిన ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడారు. కర్మాగారం నెలకొల్పితేనే పాల్వంచకు మహర్దశ వస్తుందన్నారు. కర్మాగారానికి అవసరమైన నీరు, బొగ్గు, రైల్వేలైన్, స్థలం, యాష్ పాండ్ తదితర వనరులున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బరపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, బద్ది కిశోర్, వై.వెంకటేశ్వర్లు, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, బాలినేని నాగేశ్వరరావు, జమ్ముల సీతారాంరెడ్డి, తుమ్మల శివారెడ్డి, భువన సుందర్‌రెడ్డి, రాము, చిరంజీవి, సత్యనారాయణ, భరత్, మహేశ్, నాగిరెడ్డి, కాపా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్, వీధిలైట్ల నిర్వహణపై దృష్టి



శ్మశానవాటికలో వాగును పరిశీలిస్తున్న చైర్మన్

ఇల్లెందు: పట్టణంలోని 2, 18 వార్డుల్లో శానిటేషన్ పనులను చైర్మన్ డీవీ పర్యవేక్షించారు. సోమవారం స్థానిక కౌన్సిలర్లు పద్మావతి, స్వాతితో కలిసి వార్డులో పర్యటించారు. ఇంటింటికీ శానిటేషన్ పనులను పరిశీలించి ఖాళీ ప్రదేశాల్లో ఏపుగా ఎదిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. కాల్వల్లో పేరుకుపోయిన మట్టి, పూడికను తొలిగించి వర్షాకాంలో నీరంతా కాల్వల్లోకి వెళ్లేలా పూడిక తీయాలని మున్సిపల్ వర్కర్లను ఆదేశించారు. ఇల్లెందులపాడులోని హిందూ శ్మశానవాటికలోకి వెళ్లే రోడ్డులో వాగు మీద తాత్కాలిక వంతెన నిర్మాణం చేస్తామని అక్కడి కౌన్సిలర్ పద్మావతికి హామీ ఇచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, జవాన్లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

వానొస్తే ఇక అంతే..



గిరిజన కళాశాల ప్రాంగణంలో



కిన్నెరసాని క్రీడా పాఠశాల మైదానంలో..

మండలంలోని గిరిజన గురుకుల ప్రతిభ జూనియర్ కళాశాల ప్రహరీ కూలిపోగా వర్షం వస్తే వరద నీరు చేరి కుంటను తలపిస్తోంది. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక కిన్నెరసానిలోని ఐటీడీఏకు చెందిన గిరిజన ఆశ్రమ క్రీడా పాఠశాలకు చెందిన మైదానంలో వరద నీరు చేరి చెరువును తలపిస్తోంది. మైదానంలోకి నీరు చేరకుండా డ్రెయినేజీ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

–పాల్వంచరూరల్